ఫిరాయింపులపై కాంగ్రెస్ నీతులా?

రాహుల్‌గాంధీకి చిత్తశుద్ధి ఉంటే కడియం, దానం, తెల్లంపై అనర్హతవేటు వేయాలి

కాంగ్రెస్ హామీలు నీటిమూటలు ● జేబుదొంగల్లా, పగటిదొంగల్లా కాంగ్రెస్ పాలన

కష్టపడటమంటే ఢిల్లీకి కప్పం కట్టడమేనా? ● మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నుంచి పార్టీ ఫిరాయించిన వారిని పక్కనపెట్టుకుని కాంగ్రెస్ నాయకులు నీతులు చెప్తున్నారని, ఇది దేశ ప్రజలను మోసం చేయడమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. రాహుల్‌గాంధీకి తెలివి, జ్ఞానం, చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌పై తక్షణమే అనర్హత వేటువేసి, నిజాయితీని చాటుకోవాలని సవాల్ చేశారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయిస్తారో, అనర్హతవేటు వేస్తారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. అనర్హతవేటు పిటిషన్లు స్వీకరించేందుకు స్పీకర్ సమయమివ్వడంలేదని, పిటిషన్లు తీసుకునేందుకు వెనుకడుగేస్తున్నారని ఆరోపించారు.

జేబుదొంగలు, పగటిదొంగలు

కాంగ్రెస్ పాలన తీరు జేబుదొంగల్లా, పగటిదొంగల్లా దుర్మార్గపు పాలనలా ఉన్నదని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. 2014 కంటే ముందున్న ఆరాచకాలన్నీ మళ్లీ మొదలయ్యాయని విమర్శించారు. రైతులను మిల్లర్ల దయదాక్షిణ్యాలపై వదిలేశారని ఆవేదన వ్యక్తంచేశారు. తుక్కుగూడ సభలో రైతుల ప్రస్తావనే లేదని మండిపడ్డారు. సీఎం, మంత్రులకు ఐపీఎల్ మ్యాచ్‌లు చూడటంపై ఉన్న ప్రాధాన్యం, రైతులపై లేదని ఆరోపించారు. కాంగ్రెస్ మార్పు అంటే 2014కు ముందున్న పరిస్థితి వస్తుందని ఊహించలేదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలతో మోసం చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఐదు హామీలంటూ మరో మోసానికి తెరలేపారని మండిపడ్డారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని ఇవ్వలేదని, మళ్లీ ఇప్పుడు ఏడాదికి లక్ష ఇస్తామంటున్నారని మండిపడ్డారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్‌ను నిలిపివేసి ప్రతి విద్యార్థికి లక్ష స్కాలర్‌షిప్స్ అంటూ మోసంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ హామీలు నీటమూటలని వంద రోజుల పాలనలో తేలిపోయిందని దుయ్యబట్టారు.

వ్యవసాయరంగం ఆగం

పదేండ్లు కష్టపడి కేసీఆర్ వ్యవసాయాన్ని నిలబెడితే, కాంగ్రెస్ నేతలు మూడు నెలల్లోనే ఆగం చేశారని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ రాష్ట్రంలో పర్యటిస్తుంటే కాంగ్రెస్ నాయకులకు లాగులు తడుస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఇన్ని రోజులు నీళ్లు లేవని అన్నారని, అప్పుడు లేవన్న నీళ్లు ఇప్పుడు ఎట్లా వచ్చినయ్? పనిచేయవన్న మోటర్లు ఎట్లా నడిచినయ్? అని ప్రశ్నించారు. కేసీఆర్ పర్యటిస్తుండటంతో నీళ్లు వదిలారని, పంటలు ఎండిన తర్వాత నీళ్లుస్తుంటే రైతులు నవ్వుకుంటున్నారని చెప్పారు. దీనికి ముఖ్యమంత్రి, ముంత్రులు సిగ్గుతో తలదించుకోవాలని పేర్కొన్నారు. నాగార్జునసాగర్‌లో ఇంతకంటే తక్కువ నీళ్లు ఉన్నప్పుడు కూడా తాము సాగుకు నీళ్లు ఇచ్చామని గుర్తుచేశారు.

వీళ్లు మంత్రులా? పోలీసులా?

మాట్లాడితే జైళ్లోపెడతాం, పేగులు మెడలో వేసుకుంటామంటూ కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. 'రైతుల తరుపున మాట్లాడితే, సాగు, తాగునీరు ఇవ్వాలని అడిగితే జైళ్లో పెడతారా? కేసీఆర్ ఏనాడైనా ఇలా బెదిరించారా? కేసీఆర్‌ను జైళ్లో పెట్టేందుకు రేవంత్‌రెడ్డి ఎవరు? ప్రభుత్వంలో వీళ్లు మంత్రులా? లేక పోలీసులా?' అని ప్రశ్నించారు. కరెంటు మంత్రికి కరెంట్ ఇచ్చే, నీళ్ల మంత్రికి నీళ్లిచ్చే సోయిలేదని మండిపడ్డారు. జైళ్లకు భయపడటానికి కేసీఆర్.. రాహుల్‌గాంధీ కాదని జగదీశ్‌రెడ్డి చురకలేశారు.

కష్టపడటమంటే కప్పం కట్టడమేనా?

వంద రోజుల్లో కాంగ్రెస్ పాలకులు రాష్ట్రంలో వసూళ్లు చేసి ఢిల్లీకి కప్పం కడుతున్నారని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. మిల్లర్లు, క్రషర్ యజమానులు, కాంట్రాక్టర్ల దగ్గర వసూళ్లు చేస్తున్నారని, కష్టపడటమంటే ఇదేనా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక ఉన్న ధర పోయిందని రైతులు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఎండిన పంటలకు తక్షణమే ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని, రైతులకు వెంటనే రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలని, వెంటనే అందరికీ రైతుబంధు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల జోలికి వెళ్లొద్దని బ్యాంకులకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీలను అమలుచేయకుంటే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, పార్టీ నేత నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం

స్వార్థం కోసమే పార్టీ మార్పు

- బీఆర్ఎస్‌కు అతి త్వరలోనే మంచి రోజులు
- మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 7: 'కొంత మంది ఎమ్మెల్యేలు వారి స్వార్థం కోసమే పార్టీ మారారు. కష్టాల్లో ఉన్న వ్యక్తికి నేనున్నాననే నాయకులు కావాలి. అదే మనం కేసీఆర్‌కు ఇచ్చే ధైర్యం' అని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌కు అతి త్వరలోనే మంచి రోజులు రాబోతున్నాయని తెలిపారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల పాదాలు కడిగి నెత్తిన పోసుకుంటానని అన్నారు. దొంగలు, స్వార్థపరులు పోయారని, చెత్త పోయింది, గట్టి మిగిలిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు తన పక్కన ఉండి అన్నీ అనుభవించిన కొందరు నాయకులు ఇప్పుడు పార్టీ మారినట్టు దుయ్యబట్టారు. తనను మోసం చేసిన వారికి తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలు, ప్రజలను కోరారు. కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు పోచారం భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి

- తెలంగాణ ప్రజలు కేసీఆర్ పాలననే కోరుకుంటున్నరు
- పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఎంపీ నామా

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నామా. చిత్రంలో ఎంపీ వద్దిరాజు

జూలూరుపాడు, ఏప్రిల్ 7: మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో అనతికాలంలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో ఆదివారం జరిగిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. కష్టకాలంలో పార్టీకి నాయకులు అండగా ఉండాలని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకే భవిష్యత్తు ఉన్నదని, కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో తాగు, సాగునీటికి కటకట ఏర్పడిందని, రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం సాగునీటిని అందించలేకపోతున్నదని దుయ్యబట్టారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎంపీగా కేంద్ర ప్రభుత్వంపై పోరాడి జిల్లాకు పలు రోడ్లను జాతీయ రహదారులుగా మార్చిన విషయాన్ని గుర్తుచేశారు. రైతు సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అమలుచేసిన పథకాలను అమలు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాటిని రద్దు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని విమర్శించారు.

కాంగ్రెస్‌ది ప్రతీకార పాలన

- తెలంగాణ ప్రజలకు, ద్రోహులకు మధ్య పోరాటం
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కరీంనగర్‌లో నిర్వహించిన యుద్ధభేరి సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే గంగుల, నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సుంకె

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 7: కాంగ్రెస్ ప్రజా పాలనను వదిలి ప్రతీకార పాలనను కొనసాగిస్తున్నదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన జనజాతర సభలో 'జైలులో పెడుతాం.. అక్కడే డబుల్ బెడ్రూం ఇల్లు కట్టిస్తాం' అని సీఎం స్థాయి వ్యక్తి మాట్లాడాల్సిన మాటలేనా? అని ప్రశ్నించారు. తాము ప్రజల సమస్యలపై నిలదీస్తుంటే వారు మాత్రం జైలు, కేసులు అంటూ ప్రతీకారం తీర్చుకునేలా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికలు తెలంగాణ ప్రజలకు.. తెలంగాణ ద్రోహులకు మధ్య జరుగుతున్న పోరు అని పేర్కొన్నారు. శవాలు, శివాలు అని మాట్లాడే విధ్వంసకారులను పార్లమెంట్‌కు పంపిస్తే రాజ్యాంగం భద్రంగా ఉంటుందా? అని ప్రశ్నించారు. నిత్యం ప్రజల అభ్యున్నతి కోసం, జిల్లా అభివృద్ధి కోసం పాటుపడే వారిని పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని దాసరి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంట్ స్థాయి యుద్ధభేరి సదస్సులో ఆయన మాట్లాడారు. ఇది పదేండ్ల కేసీఆర్ అభివృద్ధి పాలనకు, వంద రోజుల అబద్ధాల కాంగ్రెస్ పాలనకు మధ్య జరుగుతున్న ఎన్నికల పోరు అని ఆయన పేర్కొన్నారు. 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్తుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం వారి అడ్రస్సులు చెప్పండి, విచారణ చేసి ఎన్నికల తర్వాత ఆదుకుంటామని అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అంటూ హామీలిచ్చిందని, కానీ అది గ్యారెంటీల ప్రభుత్వం కాదని, గారడీల ప్రభుత్వమని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. ఈ సారి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే పిల్లల భవిష్యత్తు అభివృద్ధి వైపుగా సాగుతుందని తెలిపారు.

అభివృద్ధి కోసం పని చేస్తా: వినోద్‌కుమార్

ఈ ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే వచ్చే ఐదేండ్లు తెలంగాణ అభివృద్ధి కోసం, సంక్షేమం కోసమే పని చేస్తానని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్ సూచించారు. బీఆర్ఎస్ ఏది చెప్పిందో? అది చేసి చూపించిందని అన్నారు. రైతులకు 24 గంటలు కరెంటు, సాగునీరు అందిస్తామని చెప్పి.. అమలు చేసి చూపించినట్టు తెలిపారు. తనను మళ్లీ గెలిస్తే తప్పకుండా నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులతో రేవంత్ చెలగాటం

- నీళ్లు లేవని.. కాళేశ్వరం నుంచి నీళ్లెలా ఇచ్చారు?
- రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నా పట్టించుకోరా?
- బీఆర్ఎస్‌తో టచ్‌లోకి ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- బీఆర్ఎస్ నేత గట్టు రామచంద్రరావు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని బీఆర్ఎస్ నేత గట్టు రామచంద్రారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లే లేవని ఇంతకాలం చెప్పిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు ఎలా ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ తెచ్చిన కరువుతో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు తమను పట్టించుకునే నాథుడు లేకపోవడంతో నేతన్నలు సైతం ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు రోజుల్లోనే ఆరుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నేతలతో టచ్‌లోకి వచ్చారని, ప్రజల తీర్పును గౌరవించి తమ అధినేత పార్టీ ఫిరాయింపులకు పాల్పడలేదని తెలిపారు. ఆరోజు కేసీఆర్ తలచుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉండేది కాదని చెప్పారు. 'పార్టీ ఫిరాయింపులపై చట్టం తెస్తామని రాహుల్‌గాంధీ అంటుంటే, రేవంత్‌రెడ్డి మాత్రం పార్టీ మారిన వ్యక్తులను స్టేజీపై కూర్చోబెట్టాడని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో రూ.50 లక్షలు ఎక్కడి నుంచి తెచ్చాడో రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు క్లారిటీ ఇవ్వలేదని, ముందు ఆయననే జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. సీఎం పదవి పోయిన తరువాత ముందు జైలుకు వెళ్లేది రేవంత్‌రెడ్డేనని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఒక్కటి కూడా సరిగ్గా అమలు చెయ్యడం లేదని విమర్శించారు. తుక్కుగూడ కాంగ్రెస్ సభ తుస్సుమన్నదని ఎద్దేవాచేశారు. రాహుల్‌గాంధీని పిలిపించుకుని రేవంత్‌రెడ్డి రెచ్చిపోయాడే తప్ప సభలో పస లేదన్నారు. రాహుల్‌గాంధీకి తెలంగాణపై పదేండ్లలో లేని ప్రేమ ఇప్పుడు ఎలా వచ్చిందో చెప్పాలని కోరారు. మరోవైపు మోదీతో సంబంధాలు పెట్టుకున్న రేవంత్‌రెడ్డి తమ పార్టీ నేత రాహుల్‌గాంధీ పరువు తీశాడని అన్నారు. కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూనే కవిత అరెస్టు సరైందేనని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం వారి మానసిక స్థితికి అద్దం పడుతున్నదని దుయ్యబట్టారు.

తెల్లంకు ప్రజలే బుద్ధిచెప్తరు

- పదవికి వెంకట్రావు రాజీనామా చేయాలి
- పార్టీ ఫిరాయింపుపై హైకోర్టులో కేసు వేస్తాం
- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

భద్రాచలంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

భద్రాచలం, ఏప్రిల్ 7: పార్టీ నాయకులు, కార్యకర్తల కష్టం.. ఓటర్ల ఆశీస్సులతో బీఆర్ఎస్ తరపున భద్రాచలం ఎమ్మెల్యేగా వెంకట్రావును గెలిపిస్తే 115 రోజులు కాకముందే కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుమాలిన చర్యగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పేర్కొన్నారు. భద్రాచలం నియోజకవర్గ ప్రజల తీర్పును ఎమ్మెల్యేగా గెలిచిన తెల్లం వెంకట్రావు అవహేళన చేశారని అన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని రెడ్ల సత్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హత వేటుపడేలా రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో సవరణ తీసుకువస్తామని హామీ ఇచ్చి, 24 గంటలు గడవకముందే బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం ఆ పార్టీ ద్వంద్వనీతికి నిదర్శనమని విమర్శించారు. శాసనసభ స్పీకర్ వెంటనే తెల్లం వెంకట్రావు శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఎమ్మెల్యేగా అనర్హుడిగా గుర్తించాలని కోరారు. లేనిపక్షంలో తమ పార్టీ అధినాయకత్వం సూచనల మేరకు హైకోర్టులో పిల్ వేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును కాదని వెళ్లినంత మాత్రాన బీఆర్ఎస్ పార్టీకి వచ్చే నష్టం ఏమీలేదని అన్నారు. తన వ్యక్తిగత స్వలాభం కోసం వేలాదిమంది ప్రజల ఆశలను అడియాశలు చేసిన వెంకట్రావుకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వస్తే పార్టీ ఫిరాయింపుపై నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కోఆర్డినేషన్ కమిటీలను వేస్తామని, అన్ని మండల పార్టీ పదవులు మారుస్తామని తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని చెప్పారు. సమావేశంలో భద్రాచలం నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి మానె రామకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు అన్నెం సత్యాలు, తాండ్ర వెంకట రమణారావు తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

కాంగ్రెస్ ద్వంద్వనీతి

మ్యానిఫెస్టోలో చెప్పేదొకటి, ఆచరణ మరొకటి: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): ఒక పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలను తమ పార్టీలో చేర్చుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ దొందూదొందేనని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్నదానికి, ఆచరిస్తున్నదానికి పొంతన లేదని ఎక్స్ వేదికగా దుమ్మెత్తిపోశారు. ఓ పార్టీలో గెలిచి మరో పార్టీలో చేరిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వేటు పడేలా చట్ట సవరణ చేస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్నదని కానీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు ఏకంగా ఎంపీ టికెట్ కేటాయించి తన ద్వంద్వనీతిని బయటపెట్టుకున్నదని మండిపడ్డారు. మరో ఎమ్మెల్యేకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నదని విమర్శించారు. గెలిచేంత వరకు ఒకమాట, గెలిచాక ఇంకోమాట.. ఇదే కాంగ్రెస్ రీతి, నీతి అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కాంగ్రెస్ హామీలెటుపాయె?

- ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతరు?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి వేముల ఆగ్రహం

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లోని బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, ఏప్రిల్ 7: అధికారంలోకి వస్తే వందరోజుల్లో హామీలు అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. వంద రోజులు దాటినా హామీల అమలు ఎటుపాయె? అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లోని లలితా గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణమని హామీ ఇచ్చి బస్సుల సంఖ్యను తగ్గించారని ఆరోపించారు. ఉచిత విద్యుత్తు కొందరికే ఇస్తున్నారని, సిలిండర్ సబ్సిడీ ఏ ఒక్కరికీ వచ్చిన దాఖలాలు లేవని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ఏ ముఖం పెట్టుకుని లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. అసెంబ్లీలో హామీల అమలు గురించి అడిగితే 50 రోజులకే అడిగితే ఎలా ఇంకా సమయం ఉన్నదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని, మరి ఇప్పుడు వందరోజులు దాటిన హామీల అమ లు ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ రూ.2 లక్షల విషయంలో ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపిస్తున్నారని మండిపడ్డారు. పదేండ్లు సీఎంగా కేసీఆర్ చేసిన కృషి అభినందించదగినదనే విషయాన్ని ఇప్పు డు ప్రజలు మాట్లాడుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ వచ్చినప్పటినుంచి ఇటు రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులొచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలు మారిన వారిని పిచ్చికుక్కలను కొట్టినట్టు కొట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్న మాటలను ఆయన గుర్తు చేశారు. పార్టీలు మారిన వారిని కొట్టాలా? పార్టీలు మారేలా ప్రోత్సహిస్తున్న వారిని కొట్టాలా? అని ప్రశ్నించారు. ఐదు రోజుల్లో పసుపుబోర్డు తెప్పిస్తానని బాండ్ పేపర్ రాసి చ్చి ఇక్కడి ప్రజలు, రైతులను మోసం చేసిన ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు కార్యాలయం ఎక్కడ ఉన్నదో చూపించాలని డిమాండ్ చేశా రు. హామీల అమలు విషయంలో ప్రజల పక్షా న ప్రశ్నించే గొంతుకగా నిలబడే బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. తనను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధికి నిధులు తీసుకొస్తానని తెలిపారు.

మాదిగలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- ఊరూరా కాంగ్రెస్ నేతలను అడ్డుకోవాలి : మంద కృష్ణ

మిర్యాలగూడ, ఏప్రిల్ 7 : కాంగ్రెస్ మాదిగలకు తీరని అన్యాయం చేస్తున్నదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విమర్శించారు. రాష్ట్రంలో మాదిగలకు రిజర్వు అయిన లోక్‌సభ సీట్లను మాలలకు కేటాయించడం సరికాదన్నారు. ఆదివారం ఆయన మిర్యాలగూడలో మాట్లాడుతూ.. మాదిగలు కాంగ్రెస్‌ను ప్రధాన శత్రువుగా భావించాలని సూచించారు. బీసీలు సైతం కాంగ్రెస్‌ను నమ్మడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు మాదిగ పల్లెల్లోకి వస్తే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. తన రాజకీయ ఎదుగుదలకు మాదిగలే కారణమన్న సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగలపై ప్రేమ లేదని విమర్శించారు.

ఉద్యోగాలిచ్చామంటూ కాంగ్రెస్ డ్రామా

నోటిఫికేషన్లిచ్చింది కేసీఆర్ సర్కారు ● నియామక పత్రాలిచ్చి కాంగ్రెస్ డబ్బా!

- బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాల విషయంలో 'మందికి పుట్టిన బిడ్డను మా బిడ్డ' అని ప్రచారం చేసుకున్నట్టుందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం నియామకపత్రాలు ఇస్తూ డబ్బా కొట్టుకుంటున్నదని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలు ఇచ్చిందని ఆ పార్టీ నేత రాహుల్‌గాంధీ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉన్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో ఇప్పటివరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని, ఒక్క నియామక పరీక్ష కూడా నిర్వహించలేదని తెలిపారు. మరి అలాంటప్పుడు 30 వేల ఉద్యోగాలు ఎలా ఇచ్చారో చెప్పాలని రాహుల్‌గాంధీని డిమాండ్ చేశారు. గురుకుల, స్టాఫ్‌నర్స్, పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు